
భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 28.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
సోమవారం 17 జూన్ 2024



సోమవారం.. పోదాం పోలవరం



పోలవరం మళ్లీ పరుగులు పెట్టనున్నదా ? పూర్వకళ తిరిగి రానున్నదా ? ఈ ఐదేళ్లలో వైసీపీ మూలన పడేసిన ప్రాజెక్టు పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం-పోలవరం కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించేందుకు నేడు శ్రీకారం చుట్టనున్నారు. గత టీడీపీ హయాంలో ప్రతీ సోమవారం దృష్టి పెట్టి పనుల పురోగతిని స్వయంగా పరిశీలించి సుమారు 73 శాతం పనులను పూర్తి చేశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక పదే పదే ముహూర్తాలు మారాయి కానీ పనులు ఇంచు కూడా కదల్లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబు మొదటిగా పోలవరంపై దృష్టి పెట్టారు. నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించి ప్రాజెక్టు స్థలిలోనే ఉన్నతస్థాయి సమీక్షకు దిగుతున్నారు. ఇన్నాళ్లు ఎడారిగా మార్చేసిన పోలవరానికి తిరిగి ఊపిరి పోసి జీవం తెచ్చేందుకు సంకల్పించారు.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

నేడు సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పరిశీలన

- గడిచిన ఐదేళ్లలో పోలవరం సర్వనాశనం
- ఎత్తు తగ్గించినా నో అనని జగన్ సర్కార్
- నిర్వాసిత కుటుంబాలతోను చెడుగుడు
- కూటమి ప్రభుత్వం రాకతో పూర్వ కళ
- ఇక సోమవారం పర్యటన ఆనవాయితీకి శ్రీకారం

పోలవరం ప్రాజెక్టు..ఈ పేరు చెబితేనే యావత్ రాష్ట్ర రైతాంగం అప్రమత్తమవుతుంది. వేల కోట్లు వెచ్చించి కీలక పనులన్నింటినీ శరవేగంగా పూర్తి చేయించడంలో 2014-19 మధ్య అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు కంటిమీద కునుకు లేకుండా పనిచేశారు. ప్రాజెక్టులో అంతర్భాగమైన స్పిల్‌వే పనులను కొలిక్కి తీసుకురాగలిగారు. దాదాపు 27 సార్లు పైగా పోలవరం ప్రాజెక్టు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించి అక్కడికక్కడ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఏ రోజుకారోజు లక్ష్యాలు నిర్దేశించి అటు కాంట్రాక్టు ఏజెన్సీకి, ఇటు ఇంజనీర్లకు లక్ష్యాలు ముందుంచారు.పోలవరం పనుల్లో అనేక రికార్డులు గిన్నిస్‌కు ఎక్కాయి. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు ఒకవైపు నిర్వాసితులను ఒప్పించి మెప్పించడమేకాకుండా ఎక్కడా పనులకు ఆటంకం లేకుండా సక్సెస్ అయ్యారు. మరోవైపు కేంద్రం నుంచి తగిన నిధులు రాబట్టేందుకు శత విధాలా ప్రయత్నించారు. ఒకవైపు అమరావతి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూనే సమాంతరంగా పోలవరం పనులు శరవేగంగా ముందుకు సాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఫలితంగా ప్రధాన డ్యాం నిర్మాణానికి అనువైన పరిస్థితులను అప్పట్లోనే ఆయన తేగలిగారు. ఒకవైపు ఎగువ కాఫర్ డ్యాం, ఇంకోవైపు దిగువ కాఫర్ డ్యాం నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అందరినీ పరుగులు పెట్టించారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగు, తాగునీరు అందేలా నిత్య సమీక్షలతో జాగ్రత్తలు తీసుకున్నారు. ఆంధ్రుల జీవనాడిగా ప్రాజెక్టుకు నామకరణం చేసి అనుకున్న లక్ష్యాలకు చేరేందుకు వీలుగా ఎక్కడా జాప్యంకాని, సాంకేతిక లోపం లేకుండా చేయడం ఇంకో ఎత్తు. 2014లో అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు పోలవరంపై దృష్టి పెట్టి క్షణం తేడా లేకుండా ఆసాంతం పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నించారు. కేంద్రం నుంచి నిధులు ఆలస్యమైనా ఆలోపే రాష్ట్ర బడ్జెట్ నుంచి కొంత భరించి మరీ పనుల్లో జాప్యాన్ని తగ్గించగలిగారు. ప్రతీసారి అత్యంత ఆధునిక పద్ధతుల్లోనే ప్రాజెక్టు నిర్మాణం ముందుకు సాగుతూ వచ్చింది. ఎర్త్ కం రాక్‌ఫిల్‌డ్యాం నిర్మాణంలో భాగంగా ముందస్తుగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించారు. జర్మనీకి చెందిన బావర్ కంపెనీ డయాఫ్రంవాల్ నిర్మాణంలో కీలక పాత్ర వహించింది. దీని నిర్మాణం పూర్తయిన వెంటనే ఎగువ, దిగువ కాఫర్ డ్యాం పనులు చకచకా సాగాయి. ఇంకోవైపు జల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి పనులు పరుగులు పెట్టించారు. ఈ విద్యుత్ కేంద్రం ద్వారా ఉత్పత్తయిన దానిలో రాష్ట్ర అవసరాలు పోను పొరుగు రాష్ట్రాలకు విక్రయించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. నిర్వాసిత కుటుంబాలకు ఎక్కడా అసంతృప్తి ఎదురుకాకుండా అధికార యంత్రాంగాన్ని ముంపు గ్రామాల వైపు నడిపారు. పరిహారం విషయంలో ఎలాంటి లోటు లేకుండా జాగ్రత్తపడ్డారు. కొన్నిచోట్ల న్యాయపరమైన వివాదాలు ఎదురైనప్పుడు తప్ప మిగతా అన్నిచోట్ల పరిష్కారం దిశగానే దిగువ స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేసింది. దటీజ్.. చంద్రబాబు అనే దిశగా ఒకవైపు ప్రాజెక్టు నిర్మాణ పనులు, ఇంకోవైపు సహాయ పునరావాస కార్యక్రమాలను కొనసాగించగలిగారు. ఇంకొంతకాలం ఇదే రీతిలో పనిచేస్తే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యి ఉండేది. అప్పటి జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమా అత్యధిక సార్లు ప్రాజెక్టును సందర్శించి పనులను సమీక్షించగలిగారు. సీఎం హోదాలో చంద్రబాబు 2019 జనవరి 7వ తేదీన చివరిసారిగా పోలవరం ప్రాజెక్టును సందర్శించారు.

జగడాల జగన్‌తో ఒరిగిందేంటి ?

తెలుగుదేశంను కాదని 2019లో వైసీపీని అధికారంలోకి తెచ్చారు. పర్యవసానంగా సవ్యంగా సాగుతున్న పోలవరం ప్రాజెక్టుకు మహర్దశ కల్పించాల్సింది పోయి.. అష్ట దరిద్రం దాపురించేలా చేశారు. కేంద్రం అడుగులకు మడుగులొత్తుతూ ఇచ్చిన దాంతోనే సరిపెట్టుకుంటూ పోలవరంపై పరోక్షంగా కసి తీర్చుకున్నారు. ఈలోపే 2020-21లో కరోనా విజృంభించడం, ప్రాజెక్టు నిర్మాణ పనుల కార్మికులు, అధికారులు, సిబ్బంది అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిపోయారు. ఆ తర్వాత 2022 నుంచి పోలవరం పనులు లిచిపోయాయి. ప్రాజెక్టు ఎత్తును 41.75కు కుదించడంతో పాటు ప్రాజెక్టు వ్యయాన్ని 55 వేల కోట్ల నుంచి 31 వేల కోట్లకు తగ్గించినా ఎవ్వరూ నోరెత్తలేదు. ఇంకోవైపు చంద్రబాబును ఎద్దేవా చేస్తూ వచ్చారు. 2021-22 సంవత్సరాల్లో గోదావరికి వచ్చిన భారీ వరదలు అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్‌ను దెబ్బతీశాయి. ఇంకోవైపు గైడ్‌బండ్ కుంగినా జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా పోలవరం పనులపై కేంద్ర బృందాలు తూతూ మంత్రంగా సందర్శించడం, కొన్ని నివేదికలతోనే సరిపెట్టాయి. కాని గడిచిన ఐదేళ్లుగా మూడు సార్లు ప్రాజెక్టును పూర్తి చేస్తామంటూ ముహూర్తాలు పెట్టి రైతులను మోసగించారు. ఇంకోవైపు పోలవరం నిర్మాణానికి త్యాగాల కోర్చిన నిర్వాసిత కుటుంబాలతో చెడుగుడు ఆడారు. వ్యక్తిగత పరిహారం పది లక్షలు చెల్లించి తీరుతామని చెప్పి దాగుడు మూతలాడారు. సీఎం హోదాలో జగన్ కేవలం మూడుసార్లు ప్రాజెక్టును నామ్‌కా వాస్తే సందర్శించి సరి పెట్టేశారు. 2014-19లో అప్పటి సీఎం చంద్రబాబు ప్రాజెక్టు పనులను పరుగులెత్తిస్తే.. 2019-24 మధ్య జగన్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులు వెనుకబడేలా రికార్డు సృష్టించగలిగింది.


అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

త్యాగాలు చేసింది ఇందుకేనా ?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందేది. వందల గ్రామాల్లో దాహార్తిని తీర్చేది. కాని ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా తమ సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరగనేలేదు. 2019-24 మధ్య పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ముంపు గ్రామాల్లో నిర్వాసిత సంఖ్యను కుదించి ఆ దిశగానే కొత్త ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు దరిమిలా ఆ పరిధిలోకి వచ్చే నిర్వాసితులకు మాత్రమే పరిహారం చెల్లిస్తారు. మిగిలివారి వ్యవహారం పెండింగ్‌లో పెడతారు. ఇది వాస్తవ పరిస్థితి. ఇంకోవైపు చంద్రబాబు పాలనలో నిర్వాసిత కుటుంబాలకు అవసరమైన ప్రత్యేక కాలనీల నిర్మాణం అప్పట్లో చకచకా సాగింది. అప్పటి కలెక్టర్ కాటంనేని భాస్కర్ కంటిమీద కునుకులేకుండా నిర్వాసితుల కాలనీల నిర్మాణానికి జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, పోలవరం ప్రాంతాల్లో తరచూ విజిట్‌కు వెళ్ళేవారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ తరహా పరిస్థితిని గాలిలో పెట్టింది. అంతకంటే మించి వైసీపీ అధికారంలోకి రాకమునుపు జగన్ నిర్వాసిత కుటుంబాల్లో వ్యక్తిగత పరిహారాన్ని పది లక్షలకు పెంచుతూ హామీలు ఇచ్చారు. అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత కూడా 2022 చివర్లో ప్రత్యేక జీవోలు జారీ చేశారు. ఇంత చేస్తే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లో ఇవేవీ చేరనేలేదు. అధికారులు మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారు. అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబుకి ఆయా అంశాలపై ప్రత్యేక అవగాహన ఉన్నందున కనీసం ఈసారైనా తమ కష్టాలను తీర్చాలని నిర్వాసితులు కోరుకుంటున్నారు.

సీఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ఉదయం 11 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరతారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు పోలవరం ప్రాజెక్టును ఆసాంతం పరిశీలిస్తారు. కుంగిన గైడ్‌బండ్‌తో పాటు నిలిచిపోయిన అన్ని పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.05 నుంచి 3.05 గంటల వరకు ప్రాజెక్టు అధికారులతో గంటపాటు సమీక్షిస్తారు. సహాయక పునరావాస చర్యలు, భూసేకరణ తదుపరి తీసుకోవాల్సిన చర్యలపైన సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.40 వరకు మీడియా సమావేశం నిర్వహించి, 4 గంటలకు పోలవరం నుంచి ఉండవల్లికి తిరుగు ప్రయాణం అవుతారు.

ఉపాధి అవకాశాలు లేక తెలంగాణకు తరలివెళ్లిన వందలాది కుటుంబాలు ఎదుర్కొంటున్న కష్టాలను సీఎం ఎదుట ప్రస్తావించాలని భావిస్తున్నారు. పోలవరం నుంచి కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు గెలుపొందిన నేపథ్యంలో నిర్వాసిత కుటుంబాలకు ఒకింత ధైర్యం వచ్చింది.

పోలవరం మళ్లీ కళకళ !

ఐదేళ్ల తర్వాత పోలవరం ప్రాజెక్టులో సందడి నెలకొంది. ఇప్పటికే దెబ్బతిన్న ట్విన్‌టన్నల్స్ నిర్మాణ పనులకు మళ్లీ జీవం వచ్చే అవకాశం ఉంది. ప్రాజెక్టుకు సంబంధించి అనేక కీలక పరిణామాలపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)తో సహ కేంద్ర నిపుణుల బృందాలు ఇచ్చిన నివేదికల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వమే కీలక నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. డయాఫ్రమ్‌వాల్ దెబ్బ తిన్నందున కొత్తది కట్టాలా..వద్దా అనేది తేల్చాలి. కుంగిపోయిన గైడ్‌బండ్ విషయంలోను నిపుణుల సలహాల మేరకు త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. నేడు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు రానున్న సీఎం చంద్రబాబు స్వయంగా ఆయా పనులను పరిశీలించడమే కాకుండా ఉన్నత స్థాయి సమీక్షను ఇక్కడే నిర్వహించబోతున్నారు. పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు జలవనరుల శాఖ అప్పగించినందున ఇక పనుల్లోను త్వరితగతిన నిర్ణయాలు ఉంటాయని భావిస్తున్నారు.

నాడు అడ్డుకుని అవమానించారు !


రోడ్డుపై బైఠాయించిన చంద్రబాబు (ఫైల్)

జగన్ పాలనలో అందరూ అవమానాల పాలైన వారే. అడ్డగోలుగా అణచివేతకు గురైనవారే. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగి 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడునూ జగన్ ప్రభుత్వం వదలలేదు. 2022 డిసెంబరు 1న జిల్లాలో పర్యటించిన సమయంలో పోలవరం పనులు ఎందుకు చేపట్టలేక పోయారు..? ఎందుకు నీరు గారుస్తున్నారు.. ?ఇప్పటి వరకు ఏం చేశారో తేల్చుకుంటామంటూ చంద్రబాబు నేరుగా పట్టిసీమ నుంచి పోలవరం వైపు బయల్దేరారు. పోలవరం గ్రామ సమీపంలో ఉన్న ప్రాజెక్టు ముఖద్వారం వద్ద పెద్ద సంఖ్యలో పోలీసులు చంద్రబాబు కాన్వాయ్‌ను అడ్డగించి వెళ్లడానికి వీల్లేదన్నారు. దీంతో చంద్రబాబు భగ్గుమన్నారు. తనను ఎందుకు అడ్డుకుంటున్నారని పోలీసు అధికారులను నిలదీశారు.ప్రతిపక్ష నేతగా, మాజీ సీఎంగా పోలవరం ప్రాజెక్టును సందర్శించే అధికారం తనకు ఉందని, అడ్డుకునే అధికారం ఈ ప్రభుత్వానికి ఎవరిచ్చారని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా నడిరోడ్డుపై బైఠాయించారు. అవ్వాక్కయిన పోలీసులు ఆయనకు సర్ది చెప్పేందుకు ప్రయత్నించినా ససేమిరా అన్నారు. తెలుగుదేశం నేతల సమక్షంలోనే అంతా కలసి నడిరోడ్డుపై గంటన్నర పైగా బైఠాయించారు. ఆనాడు చంద్రబాబును జరిగిన అవమానాన్ని, పోలీసుల అడ్డగోలు తనాన్ని వైసీపీ ఎక్కడా ఖండించకపోగా ఆనాటి జల వనరులశాఖ మంత్రి అనిల్ కుమార్ వ్యంగంగా వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు సీఎం హోదాలో చంద్రబాబు 28వ సారి పోలవరం సందర్శనకు వస్తున్నారు.

పోలవరంలో పటిష్ఠ ఏర్పాట్లు


పరిశీలిస్తున్న జేసీ లావణ్య, ఎస్పీ ప్రశాంతి తదితరులు

పోలవరం, జూన్ 16 : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు సోమవారం రానున్న నేపథ్యంలో ఆదివారం ప్రాజెక్టు వద్ద జిల్లా యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో భారీగా పోలీస్ యంత్రాంగం, ప్రత్యేక పోలీసు బలగాలు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నాయి. సీఎం పర్యటించనున్న అన్ని ప్రాంతాలకు క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా దళాలు హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించాయి. జిల్లా పంచాయతీ అధికారి తూతిక విశ్వనాథ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మిక సిబ్బంది పారిశుధ్య మెరుగుదల కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు కార్యాలయం, హిల్‌వ్యూ ప్రాంతంలో చెత్తను, పొదల్ని తొలగించారు. టీడీపీ పాలనలో ప్రాజెక్టు కార్యాలయాల ఆవరణలో ఏర్పాటు చేసిన 24 గంటల కాంక్రీట్ గిన్నిస్ రికార్డు పైలాన్, మంత్రివర్గ పైలాన్, తొలి రేడియల్ గేట్ పైలాన్‌లను శుభ్రం చేసి రంగులు వేసి సిద్ధం చేస్తున్నారు. భద్రత ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు రానీయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. భద్రతా ఏర్పాట్ల కోసం 1100 మంది పోలీసు బలగాలను, ప్రత్యేక పోలీసు బలగాలను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు ఏఎస్పీలు, పదిమంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 70 మంది ఎస్ఐలు పాల్గొంటారని తెలిపారు.

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. జేసీ లావణ్య వేణి,పీవో సూర్యతేజ ఇతర అధికారులతో సమీక్షిస్తూ సీఎం పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. ప్రాజెక్టు వద్ద చేస్తున్న భద్రతా ఏర్పాట్లు జేసీ లావణ్యవేణి స్వయంగా పరిశీలించారు. సీఎం పర్యటించనున్న స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, పవర్ హౌజ్, డయాఫ్రంవాల్, గైడ్ బండ్, డ్యాం సీపేజీ, లీకేజీ ప్రాంతాల్లో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.


తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది

ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పించండి సారూ !

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కొరతతో రైతుల ఆవేదన

సార్టేజ్ అంటూ చేతులెత్తేస్తున్న అధికారులు


మాధవరంలో దొంగలు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 16: వ్యవసాయ బోర్ల వద్ద ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటులో అధికారులు చేతులెత్తేయడంతో రైతులు ఆందోళనలో మునిగి పోయారు. గత ప్రభుత్వం రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లను ఇవ్వడంలో అలసత్వం చూపించడంతో రైతులు నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి. ఇటు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు లేక మరో పక్క మొక్కలకు నీరందించలేక రైతులు నలిగి పోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీతో ఇబ్బంది

వైర్ల కోసం దొంగలు బోర్ల వద్ద ఉన్న లక్షల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎఫ్ఐఆర్ కడితే కానీ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఇండెంట్ పెట్టేందుకు వీలుండదని అధికారులు చెప్పడంతో పంటచేలను వదిలి రైతులు పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి. ఎఫ్ఐఆర్ వేసిన తరువాత కూడా ఈ ట్రాన్స్‌ఫార్మర్లు లేవని చెప్పం డటంతో రైతులు ఇటు వ్యవసాయం సాగు చేయలేక విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం అధికారుల చుట్టూ తిరగలేక తీవ్ర వేదనకు గురవుతున్నారు. జిల్లాలో 129 ట్రాన్స్‌ఫార్మర్‌లు సార్టేజ్ ఉంటే ఒక్క తాడేపల్లిగూడెంలోనే 20 ట్రాన్స్‌ఫార్మర్ల వరకూ సార్టేజ్ ఉండటం గమనార్హం.

రైతులను గాలికి వదిలేశారు



గత ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసింది. ఓట్లు తప్ప రైతుల బాగోగులు ఎప్పుడూ చూడలేదు. రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌లను కేటాయించడంలో తీవ్ర అలసత్వం వహించింది.

నార్నిరెడ్డి దొరబాబు, అప్పారావుపేట

ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తేనే సాగు



మా ట్రాన్స్‌ఫార్మర్ ఏప్రిల్ నెలలో ధ్వంసం చేశారు. అప్పటి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వలేదు. మా గ్రామంలోనే మరో రెండు ట్రాన్స్ ఫార్మర్‌లు ధ్వంసం చేశారు. పంట సాగు చేయాలంటే అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు త్వరగా అందించాలి.

కొలూరి వెంకన్న, మాధవరం

కోటిపల్లి రైల్వే లైన్.. ఇక జెట్ స్పీడ్



- ఐదేళ్లుగా నిర్లక్ష్యం
- ఒక్క రూపాయి ఇవ్వని జగన్ ప్రభుత్వం
- రెండేళ్ల క్రితమే పూర్తికావాల్సిన ప్రాజెక్టు
- కూటమి రాకతో కొత్త ఆశలు

నరసాపురం, జూన్ 16: "అభివృద్ధి వద్దు.. సంక్షేమానికే మా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. గత ప్రభుత్వాలు కుదుర్చుకున్న ఒప్పందాలు మాకు తెలియదు..మేము ఒక్క రూపాయి ఇవ్వం.. మీరు ప్రాజెక్టులు చేయనవసరం లేదు." ఇది రైల్వే ఉన్నతాధికారులకు నాటి జగన్ ప్రభుత్వంలోని కొందరు పెద్దలు చెప్పిన మాటలు. రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టులకు ప్రభుత్వం ఒప్పందం ప్రకారం ఇవ్వాల్సిన వాటాలను విడుదల చేయకపోవడంతో రైల్వే అధికారులు ప్రభుత్వ పెద్దల్ని కలిసినప్పుడు ఈ విధంగా స్పందించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా 2021లో నరసాపురం వచ్చి నప్పుడు ఈ విషయాన్ని స్వయంగా విలేకర్లకు చెప్పారు. అప్పట్లో ఇది పెద్ద సంచలనం సృష్టించింది. వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరుగుతున్న రైల్వే ప్రాజెక్టులకు ఒక్క రూపాయి వాటా చెల్లించలేదు. అందులో నరసాపురం-కోటిపల్లి రైల్వే ప్రాజెక్టు ఉంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒకసారి వాటా మొత్తంగా రూ.50 కోట్లు చెల్లించారు. తరువాత రూ.150 కోట్లు చెల్లింపులకు సంబంధించి జీవో ఇచ్చారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ జీవోను తొక్కిపెట్టింది. తరువాత ఐదేళ్లలో కూడా అసలు ఈ ప్రాజెక్టు వైపే చూడలేదు. లక్ష్యం ప్రకారం 2023 నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పనులు ముందుకు సాగలేదు.

రాష్ట్ర విభజన తరువాత పచ్చజెండా

ఉభయ గోదావరి జిల్లాల వాసుల చిరుకాల వాంఛ నరసాపురం కోటిపల్లి రైల్వేలైన్, బ్రిటిష్ హయాంలో దీన్ని ప్రతిపాదించారు. భారీ ప్రాజెక్టు కావడంతో పనులు సాగలేదు. బాలయోగి స్పీకర్‌గా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్టులో కదలిక వచ్చింది. ప్రతి బడ్జెట్‌లోనే కేంద్రం సర్వేకు నిధులిస్తూ వచ్చింది. రాష్ట్ర విభజన తరువాత 2014 ఎన్నికల్లో ఆప్పటి ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఈ ప్రాజెక్టును చేపడతామని హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్ర బాబు ప్రభుత్వాలు వచ్చాయి. 2016లో ఈప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2200 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఒప్పందం ప్రకారం 25 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ఇందులో అప్పటి ప్రభుత్వం తొలి విడతగా రూ.50 కోట్లు చెల్లించింది. 2019లో మరో రూ.150 కోట్లు జీవో జారీ చేసింది. అయితే తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మొత్తం చెల్లించలేదు. కానీ రైల్వే మాత్రం ప్రతి బడ్జెట్‌లోనూ నిధులు విడుదల చేస్తూ వచ్చింది. గత ఏడాది వరకు రూ.1350 కోట్లు విడుదల చేసిన రైల్వే ఈ ఏడాది తాత్కాలిక బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు పెద్ద పీట వేసి రూ.400 కోట్లు విడదల చేసింది.


చించినాడ బ్రిడ్జి నిర్మాణం కోసం వేసిన పిల్లర్లు

మూడు వంతెనలకే భారీ వ్యయం

సుమారు 57 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ కొత్త రైల్వేలైన్ పనుల్లో గోదావరిపై వంతెన నిర్మాణాలకే భారీ వ్యయం అవుతుంది. పశ్చిమలో చించినాడ వద్ద వశిష్ఠ 20 పిల్లర్లతో వంతెన, ముక్తేశ్వరం-కోటిపల్లిపై గౌతమి నదిపై 45 పిల్లర్లతో భారీ వంతెన, వైనతేయ వంతెనపై 21 పాసర్లపూడి-బోడసకుర్రు వద్ద 21 పిల్లర్లతో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఆప్పట్లో ఈ వంతెనల పనులకు సుమారు రూ.900 కోట్లు అవుతుందని అంచనా వేసింది. అయితే ప్రాజెక్టు నత్తనడకన సాగుతుండటంతో వ్యయం భారీగా పెరిగింది.

పెండింగ్‌లో భూ సేకరణ

భూసేకరణ పనులు 2016 లోనే చేపట్టారు. జిల్లాలో సేకరణ పూర్తయింది. అయితే కోనసీమలో ఇంకా చాలా చోట్ల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. కొన్ని న్యాయపరమైన ఇబ్బందులు వల్ల భూసేకరణ ముందుకు సాగలేదు. వంతెన పనులు, భూసేకరణ పూర్తయితే ట్రాక్ పనులు చేపట్టేందుకు రైల్వేకు అనుబంధంగా ఉండే ఆర్వీఎన్ఎల్ సంస్థ సిద్ధంగా ఉంది.

ఈ ఎన్నికల్లో ఎన్డీఏ ప్రధాన హామీ

అధికారంలోకి వస్తే కోటిపల్లి రైల్వే పనుల్ని జెట్ స్పీడ్‌లో పూర్తి చేస్తామని ఈ ఎన్నికల్లో ఎన్డీఏ హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా నరసాపురం పార్లమెంట్ పరిధిలో ఎంపీగా శ్రీనివాస వర్మ, ఇటు అమలాపురం ఎంపీగా బాలయోగి కుమారుడు జీఎం హర్ష ఎన్నికయ్యారు. వీరిలో వర్మకు కేంద్ర సహాయ మంత్రి పదవి దక్కింది. వీరిద్దరికి ఈప్రాజెక్టుపై పూర్తి అవగాహన ఉండటం వల్ల కేంద్రాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించగలరు. గతంలో ఈ ప్రాజెక్టుకు వైసీపీ నిధులు ఇవ్వకపోవడం వల్లే వేగవంతం కాలేదన్న విమర్శలు రావడంతో కూటమి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ చూపించనుంది. ఇదే జరిగితే మరో రెండేళ్లల్లో ఈ ప్రాజెక్టు పూర్తయ్యే అవకాశాలు లేకపోలేదు.

కేంద్రమంత్రిగా రేపు శ్రీనివాసవర్మ బాధ్యతల స్వీకరణ



భీమవరం టౌన్, జూన్ 16 : ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా భూపతిరాజు శ్రీనివాస వర్మ మంగళవారం ఢిల్లీలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 11.11 నిమిషాలకు, 12.15 నిమిషాలకు రెండు శాఖల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఆయన సోమవారం ఢిల్లీ బయలుదేరి వెళ్తున్నారు. బాధ్యతలు చేపట్టిన తరువాత 19 తిరుపతిలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. 20వ తేదీన భీమవరం రానున్నారు. దీంతో జిల్లా పార్టీ నాయకత్వం శ్రీనివాసవర్మకు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం జరిగే బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా నుంచి పలువురు బీజేపీ నాయకులు తరలి వెళ్లనున్నారు.



సాగర తీరంలో సందడి

మొగల్తూరు, జూన్ 16: మొగల్తూరు మండలంలోని కేపీపాలెం, పేరుపాలెం సాగర తీరాలు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. వాతావరణం సానుకూలంగా ఉండటం, మరికొద్ది రోజుల్లో పాఠశాలలు, కళాశాలలు తెరవనున్నందున ఖాళీగా ఉన్న విద్యార్థులు, యువకులు వారి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఆహ్లాదంగా గడిపారు. సముద్రస్నానం చేస్తూ ఉల్లాసంగా గడిపారు. తీరం వెంబడి గల పాండురంగస్వామి, వేళాంకిణి మాత, అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు.

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి
ఏలూరులో రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు

చిల్లిగవ్వ ఇవ్వలేదు
నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు 5

కిక్కిరిసిన శ్రీవారి క్షేత్రం



శ్రీవారి ఆలయ ప్రాంగణములో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జూన్ 16: చిన్నతిరుపతిగా ఖ్యాతి గాంచిన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడం వల్ల ఆలయానికి దాదాపు 18 వేల మంది పైబడి యాత్రికులు వచ్చి స్వామి, అమ్మ వార్లను దర్శించుకున్నారు. ముందుగా వీరంతా ఆలయంలో మొక్కుబడులు తీర్చుకుని, స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాతావరణం కాస్త ఎండగా, ఉక్కబోతగా ఉండడంతో దర్శనానంతరం పలువురు అనివేటి మండపంలో సేదతీరారు.

ముగిసిన కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ద్వారకాతిరుమల, జూన్ 16: త్రయాహ్నిక దీక్షతో జరుగుతున్న క్షేత్ర దేవత శ్రీకుంకుళ్లమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. శ్రీవారి ప్రధానాలయానికి ఉపాలయమైన ఈ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని మరింత శోభాయమానంగా అలంకరించారు. ఉదయం మూలవరులకు, ఉత్సవ మూర్తులకు నవకలశస్నపన. శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ. శ్రీమహా పూర్ణాహుతి హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక అలంకారాల్లో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.

మావుళ్ళమ్మకు వెండి శంఖం బహూకరణ



అమ్మవారికి శంఖం బహుకరిస్తున్న భక్తులు

భీమవరం టౌన్, జూన్ 16 : మావుళ్ళమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన మద్దిరాల ఈశ్వర శ్రీహర్ష అమ్మవారి అభిషేకానికి 400 గ్రాముల వెండి శంఖం బహుకరించారు. ఆలయానికి వచ్చిన దాతలు అమ్మవారిని దర్శించుకోగా, వీరికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానం త రఫున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేష వస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

బంగారు చీరకు రూ.11 వేలు అందజేత

● చెన్నై వాస్తవ్యులు వేదపండితులు కామశాస్త్రిఘనపాఠీ, భారతి దంపతులు అమ్మవారి బంగారు చీర నిమిత్తం రూ.11 వేలు అందజేశారు. ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకోగా ఉప ప్రధానార్చకుడు కొడమంచిలి కోప్పేశ్వర రావు అమ్మవారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు.

ఎన్నికల కోడ్ ముగిసినా తొలగని ముసుగు



నెహ్రూ విగ్రహానికి తొలగించని ముసుగు

ఆకివీడు, జూన్ 16: ఎన్నికల కోడ్ ముగిసి పది రోజులు దాటుతున్న విగ్రహాలకు వేసిన ముసుగులు ఇంకా తొలగించలేదు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు తొడిగారు. ఈ నెల నాలుగున ఫలితాలు వచ్చిన తరువాత ఆరో తేదీతో కోడ్ ముగిసింది. విగ్రహాలకు వేసిన ముసుగులు ఎండకు ఎండి, ఈదురు గాలులకు సగం సగం ఊడిపోయాయి. కొన్నిచోట్ల విగ్రహాలకు ఆయా పార్టీల నేతలు తొలగించుకున్నారు. స్థానిక నెహ్రూ సెంటర్‌లో నెహ్రూ విగ్రహానికి వేసిన ముసుగు నేటికి తొలగించలేదు. మూడుసార్లు ప్రధానిగా చేసిన నెహ్రూ విగ్రహానికి వేసిన ముసుగు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

పాట రూపంలో బాలు జీవించే ఉన్నారు



బాలు గానామృతంలో పాటలు పాడుతున్న చిన్నారి

ఏలూరు కల్చరల్, జూన్ 16: రాగం, తానం, పల్లవి శ్వాసగా బాలు జీవించారని, గాన గంధర్వుడు మనమధ్య లేకపోయినా పాట రూపంలో ఎప్పటికి మన హృదయాల్లో జీవించే ఉంటారని, పలువురు వక్తలు కొనియాడారు. నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమి ఆధ్వర్యంలో గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతిని ఆదివారం స్థానిక వైఎంహెచ్‌ఏ హాల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత చిన్నారులకు సినిమా పాటల పోటీలు నిర్వహించారు. సంగీత దర్శకుడు, ఎస్‌పీఎస్ సంస్థ అధినేత ఎస్‌పీఎస్ వాసు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం బాలు పాట, బాలుడి నోట సాంస్కృతిక కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. అనంతరం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన పాటలను పలువురు గాయనీ గాయకులు ఆలపించారు. తదుపరి బాలు పాడిన పలు గీతాల ఆధారంగా రూపొందించిన బాలు గానామృతం ఆడియో ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాటాడుతూ కళాకారులు మరణించినా చిరంజీవులే అన్నారు. రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, వైఎంహెచ్‌ఏ సభ్యులు, ఎస్‌పీఎస్ వహిదా వాసు పర్యవేక్షించారు.

జేసీఐ సభ్యులకు 152 రకాల రుచులు



152 రకాల వంటకాలు చూసి ఆశ్చర్యపోతున్న రికేష్ శర్మ

భీమవరం టౌన్, జూన్ 16 : జూనియర్ చాంబర్ ఇంటర్‌నేషన్‌లో (జేసీఐ) ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రికేష్ శర్మ ఆదివారం వార్షిక పర్యటనలో భాగంగా భీమవరం వచ్చారు. వారికి భీమవరం రుచులను చూపించారు. పట్టణానికి చెందిన పేరిచర్ల కృష్ణంరాజు సుమారు 152 రకాల వంటకాలతో స్వీట్స్, హాట్స్, వేజ్ అండ్ నాన్ వేజ్ బిర్యానిలు, ఫ్రూట్స్, వేజ్ అండ్ నాన్ వేజ్ పచ్చళ్లు మరెన్నో వంటకాలను రుచి చూపించారు. వంటకాలు చూసిన రికేష్ శర్మ ఆశ్చర్యానికి గురయ్యారు. ఇన్ని రకాల వంటకాలను ఒకే చోట చూడటం ఇదే మొదటి సారన్నారు. నడింపల్లి మహేష్ కుమార్ వర్మ ఉన్నారు.

చిల్లిగవ్వ ఇవ్వలేదు

» నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు » కూటమి విజయంతో సుపరిపాలనకు మోక్షం

» హర్షం వ్యక్తం చేస్తున్న సర్పంచ్‌లు



ఏలూరు రూరల్, జూన్ 16: వైసీపీ ప్రభుత్వంలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు ఊపిరి పీల్చుకుంటున్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో గ్రామ పరిపాలనకు అడ్డంకులు తొలగినట్లేనని మెజార్టీ సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీల అభివృద్ధికి వైసీపీ ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. పైగా కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను నాటి సీఎం జగన్ సొంత పథకాలకు మళ్ళించారు. దీంతో సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం కొందరు సొంత డబ్బులను వెచ్చించారు. తెలుగు దేశం పార్టీ మద్దతు సర్పంచ్‌లు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మంచి రోజులు రాకపోతాయా అని అవమానాలు భరిస్తూ కాలం గడిపారు. వైసీపీ సర్పంచ్‌లు పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. గెలిచాం ఇంకా అంతా తమదేనని భావించిన వారికి జగన్ చుక్కలు చూపించారు. పైసా నిధులు లేక ప్రజలకు ముఖం చూపించలేకపోయారు. సర్పంచ్ అని చెప్పుకునేందుకు ఇబ్బంది పడ్డారు.

అదో పీడకల

రాష్ట్రానికి సీఎం ఎలాగో, పంచాయతీకి సర్పంచ్ అలా అంతటి కీలకమైన పదవి వైసీపీ పాలనలో పవర్ కట్ అన్నట్లుగా మారిపోయింది. పంచాయతీ ఖాతాలో పైసా లేకపోవడంతో తమకు ఓట్లు వేసిన జనం కనీస అవసరాలను కూడా సర్పంచ్‌లు తీర్చలేక పోయారు. తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు వంటి వాటికి నిధులు కొరత వేధించింది. కొంతమంది సర్పంచ్‌లు సొంత డబ్బును వెచ్చించారు. ప్రజలకు ముఖం చూపించలేక అప్పులు తెచ్చి చేతులు కాల్చుకున్నారు. నెత్తినోరుబాదుకున్నా జగన్ కరుణించలేదని, గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. వైసీపీ హయాంలో ఉత్సవ విగ్రహాలుగా మారిపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని గమనించిన టీడీపీ అధినేత సీఎం చంద్రబాబు ఇక మేలు చేస్తారని సర్పంచ్‌లు భావిస్తున్నారు. పల్లెల్లో పరిపాలన గాడిన పడుతుందని, తమకు తగినన్ని నిధులు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో తాజా పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం నివేదిక కోరింది. పంచాయతీల వనరులు, పన్నులు, నిధులు ఖర్చు కేటాయింపులు, తదితర వివరాలు అందించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లా అధికారులు నివేదిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు.

నిధుల మళ్లింపు

పంచాయతీల ఖాతాల్లో పైసా లేకపోగా ఆదుకుంటామని భావించిన కేంద్ర ప్రభుత్వ నిధులను సైతం నవరత్నాలకు జగన్ మళ్ళించారు. 14,15 ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నుంచి రూ.8,629 కోట్లు రాగా పంచాయతీలకు పైసా ఇవ్వలేదు. మొత్తం సొమ్మును పథకాలకు మళ్ళించారు. దీంతో పంచాయతీల అభివృద్ధి అటకెక్కింది. ఉమ్మడి జిల్లాలోని 964 పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కేవలం 15 శాతం మంది టీడీపీ మద్దతుదారులు సర్పంచ్‌లుగా ఉన్నారు. మిగిలిన సర్పంచ్‌లు వైసీపీ మద్దతుదారులే. అయినా జగన్ కనికరం చూపలేదు. సొంత పార్టీ సర్పంచ్‌లకు హ్యాండ్ ఇచ్చారు.

పైసా ఇవ్వలేదు



వైసీపీ ప్రభుత్వం పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వలేదు. పంచాయతీల పరిధిలో జరిగే రిజిస్ట్రేషన్‌లకు సంబంధించిన స్టాంప్ డ్యూటీ ఫండ్ కూడా రాలేదు. పన్నుల రూపంలో అంతో ఇంతో వచ్చిన సొమ్మును విద్యుత్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి చెల్లించాల్సి వచ్చింది. అభివృద్ధి చేయాల్సి వస్తే సర్పంచ్‌లు సొంతంగా చేయాల్సిందే. - కడలి గోపాలరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు

ఇక మంచి రోజులే



టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో పంచాయతీలకు మంచి రోజులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వంలో కూడా టీడీపీ భాగస్వామ్యం అయినందున నిధులు మరిన్ని వస్తాయి. రాష్ట్ర నిధులతో పాటు కేంద్రం నిధులు వస్తాయి. అభివృద్ధికి ఎక్కువ తెచ్చుకునే వెసులుబాటు ఉంది. పంచాయతీల అభివృద్ధికి ఎలాంటి సమస్య ఉండదు. - పాలడుగుల లక్ష్మణరావు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి

» రిటైర్డ్ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ » కొనసాగుతున్న రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఏలూరు టూ టౌన్, జూన్ 16 : రాష్ట్రంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారి పీవీ లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. రైతు కూలి సంఘం రాష్ట్ర మహాసభలు ఆదివారం టొబాకో మర్చంట్ అసోసియేషన్ హాలులో రెండో రోజు కొనసాగించారు. వ్యవసాయ రంగ సంక్షోభం, పాలకుల విధానాలు, మన కర్తవ్యాలు అంశంపై వక్తలు మాట్లాడారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పితేనే వలసలు అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంయుక్త కిసాన్ మోర్చ రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే మార్గమని అన్నారు. పదేళ్లలో రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోదీ ప్రభుత్వం, కార్పొరేట్లకు రూ.25 లక్షల కోట్ల రుణాలు రద్దు చేసిందన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కూడా చెల్లించకుండా లక్షల కోట్ల నష్టానికి గురి చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో 19 కోట్ల రైతు కుటుంబాలకు కుటీర పరిశ్రమలకు ఇచ్చిన రుణాల కన్నా కేవలం 20 కార్పొరేట్ సంస్థలకు ఇచ్చిన రుణాలే ఎక్కువన్నారు. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ బ్యాంకులకు కార్పొరేట్ సంస్థలు కట్టాల్సిన రూ.28 లక్షల కోట్లు వసూలు చేశారా అని ప్రశ్నించారు. సన్న, చిన్నకారు రైతులు ప్రభుత్వం సహకరించక ప్రైవేటు వడ్డీ మూడు రూపాయలకు తీసుకొచ్చి రుణాల్లో కూరుకుపోతున్నారని అన్నారు. ప్రభుత్వం పంటల బీమా కంటే ఇన్సూరెన్స్ కంపెనీలకే ఎక్కువ మేలు చేస్తున్నాయని అన్నారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో లక్షలాదిగా ఉన్న ఉద్యోగాలను ఉద్దేశపూర్వకంగా భర్తీ చేయడం లేదన్నారు. రైతాంగ సమితి నాయకులు డాక్టర్ రాజమోహన్ భారత రాజ్యాంగ ఉద్యమం కనీస మద్దతు ధర అంశం పై వివరించారు. ఢిల్లీలో రైతుల సమస్యల పరిష్కారం కోసం నెలల తరబడి ఉద్యమాలు చేసి వందలాది మంది ప్రాణాలర్పించారని అన్నారు. దీని ఫలితంగా మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేయక తప్పలేదన్నారు. ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాల్, కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు, రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ నాగరాజు పాల్గొన్నారు.



కొల్లేరు నుంచి పట్టణంలోకి వచ్చిన కిక్కిస రేణువులు



నిర్మానుషంగా ఉన్న జాతీయ రహదారి

మండిన సండే

» భానుడి భగభగలు

» నిర్మానుషంగా ప్రధాన రహదారులు

ఆకివీడు, జూన్ 16: సూర్యుడు సండే రోజున నిప్పులు చెరిగాడు. వర్షాకాలం మొదలైన రోజు రోజుకి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. అడపా దడపా చిరుజల్లులు పడుతున్నా గుబురెండతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీనికి తోడు కొల్లేరులో కిక్కిస్ అంటించడంతో వేడిగాలుకు ప్రజలు భయపడి పోతున్నారు. ఎండ వేడికి ప్రధాన రహదారి జనసంచారం లేక నిర్మానుషంగా మారింది. వాహనాల రాకపోకలు తగ్గాయి. వాతావరణంలో తేమ శాతం తగ్గిపోవడం, వేడి విపరీతంగా పెరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే మెయిన్ సెంటర్‌లో ఆదివారం జన సంచారమే లేదు. బేరాలు లేకపోవడంతో వ్యాపారులు దుకాణాలు మూసేశారు. అత్యవసర పనుల నిమిత్త బయటకు రావాలంటే తగు జాగ్రత్తలతో పనులు ముగించుకుని ఇళ్లకు చేరుతున్నారు. శీతల పానీయాలు, పండ్ల రసాలతో ప్రజలు, భుజబలరాయుడు మంచినీటి చెరువుగట్టున గోవులు, ఆబోతులు సేదతీరుతున్నాయి.

గాలివాన బీభత్సం



పెదతాడేపల్లిలో రోడ్డుపై కూలిన చెట్లు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 16: తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం నుంచి గంటన్నర పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం ప్రజలను వణికించింది. పట్టణంలో పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడగా, కడియద్దలో సెంటర్‌లో గాలికి విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. పంట చేలన్నీ ఆకు మడుల దశలో ఉండటంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. విద్యుత్ సిబ్బంది తెగిన విద్యుత్ వైర్లు, ఒరిగిన స్తంభాలను పునరుద్ధరిస్తున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ఇరువురి మృతి

చింతలపూడి, జూన్ 16: చింతలపూడి మండలం మేడిశెట్టివారిపాలెం గ్రామంలో పామాయిల్ గెలలు కోస్తూ విద్యుదాఘాతానికి గురై దారబోయిన శ్రీనివాసరావు (32) దుర్మరణం పాలయ్యాడు. ఉదయం తోటలో గెలలు కోస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ తీగల మీద పడడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అతడని ఆసుపత్రికి తరలించటానికి ప్రయత్నించగా మృతి చెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కుటుంబరావు తెలిపారు.

● చింతలపూడి : పోతునూరి గ్రామంలో పాముకాటుకు గురై తలపనేని వెంకటేశ్వరరావు (75) మృతి చెందాడు. ఉదయం నీరు వదలటానికి మోటారు ఆన్ చేయటానికి ప్రతిరోజూ వెళ్ళినట్లే ఈ రోజు కూడా వెళ్లాడు. అయితే ఏదో పురుగు కుట్టినట్లు అనిపించి కొద్దిసేపటి తరువాత పడిపోవడంతో అతన్ని చింతలపూడి ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

● ఏలూరు క్రైం : గుర్తు తెలియని వ్యక్తి రైలు పట్టాల పక్కన మృతి చెంది ఉన్నాడని ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో ఎస్ఐ డి.నరసింహారావు ఆదివారం ఉదయం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి సమీపంలోని ఆటో నగర్ రైల్వే బ్రిడ్జి కింద సుమారు 40 నుంచి 45 సంవత్సరాలు వయస్సు కలిగిన మృత దేహం ఉంది. మృతుడు 5.5 అడుగుల ఎత్తు కల్గి ఆలివ్ గ్రీన్ రంగు పొట్టి చేతుల టీ షర్టు, నలుపు రంగు లోయర్ ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎటు వంటి ఆధారాలు లభించలేదు. రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడ్డాడా మరే ఇతర కారణాలతో మరణించాడా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● ఉండి : ఇంటి పైకప్పు దూలానికి ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి ఉండి పోలీసులు అందించిన వివరాలు ఇవే. ఉండి గ్రామం వెలివర్రు రోడ్‌లో నివశిస్తున్న గండికోట రామస్వామి(25) ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఇతని భార్య కేరళలో వుంటుంది. సంతానం లేరు. ఉరి వేసుకుని చనిపోవడానికి కారణాలు తెలియవలసి వుంది. ఇతని సోదరుడు గండికోట దుర్గాప్రసాదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి ఏఎస్ఐ ఆకురాతి సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూడుచోట్ల అగ్ని ప్రమాదాలు



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద దగ్ధమవుతున్న పచ్చగడ్డి

ఆకివీడు, జూన్ 16: పట్టణం, మండలంలోని మూడుచోట్ల ఆదివారం అగ్ని ప్రమాదాలు జరిగాయి. స్థానిక సబ్ స్టేషన్ నుంచి నిప్పులు నేలపై పడడంతో గడ్డి అంటుకుంది. ఎండకు ఎండి ఉండడంతో పచ్చగడ్డి కూడా అంటుకుని మంటలు చెలరేగడంతో, సంబంధిత అధికారులు సరఫరా నిలిపి వేసి వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అజ్జమూరు గరువులో ఉన్న ఇరిగేషన్ డ్రైనేజీ (ఆర్ అండ్ బీ బంగ్లా) కార్యాలయాల ప్రాంగణంలో పాత రికార్డులు, కోళ్ల పర్రులో గడ్డివాము అంటుకొన్నాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఎండలు విపరీతంగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వరరావు తెలిపారు.

వృద్ధుడి ఆచూకీ లభ్యం



ముదినేపల్లి, జూన్ 16 : మండలంలోని దేవరంలో చేపల చెరువుపై కాపలా ఉంటూ ఈ నెల 13న అదృశ్యమైన అత్తిలికి చెందిన దండు శ్రీరామరాజు (76) అనే వృద్ధుడి ఆచూకీ లభ్యమైంది. చెరువు వద్ద తాడు తెంచుకుని పారిపోతున్న ఆవును పట్టుకునేందుకు వెళ్లిన ఆ వృద్ధుడు వడాలి గ్రామం వరకు వెళ్లి తిరిగిరాని విషయం తెలిసిందే. అక్కడ నుంచి దారి తప్పి చినగొన్నూరు మీదుగా గుడ్లవల్లేరు చేరుకొని శనివారం సాయంత్రం గుడివాడ చేరుకున్నాడు. గుడ్లవల్లేరులో ఆ వృద్ధుడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ప్రయత్నిస్తుండగా, ఫొటో చూసిన ఒక వ్యక్తి తెలిపిన సమాచారం మేరకు గుడివాడలో శ్రీరామరాజును కనుగొన్నారు. ఆదివారం సాయంత్రం దేవరంలోని ఇంటికి తీసుకొచ్చారు.

అప్పు గొడవలో వ్యక్తి దారుణ హత్య



మృతుడు రాము

తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: అప్పుగా తీసుకున్న నగదు తీర్చాలనే గొడవలో మధ్యలో వచ్చిన వ్యక్తి బలైన ఘటన మండలంలోని పడాలలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తాడేపల్లిగూడెం మండలం పడాలకు చెందిన కొత్తా శ్రీను అదే గ్రామానికి చెందిన లింగంపల్లి నరసయ్య దగ్గర డబ్బులు అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చకపోవడంతో ఈ విషయం పెద్దల వరకూ వెళ్లింది. ఈ గొడవలు పది రోజులుగా జరుగు తున్నాయి. అయితే శ్రీను, భార్య సరస్వతి శనివారం రాత్రి లింగంపల్లి నరస య్య ఇంటికి వచ్చి ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న సరస్వతి సోద రుడు కొప్పర్తి రాము అనే రాంబాబు (48) మధ్యలో వెళ్లడంతో ఘర్షణ మరింత పెద్దదైంది. ఈ నేపథ్యంలో లింగంపల్లి నరసయ్య కుమారుడైన లింగంపల్లి మణికంఠ ఉద్రేకంలో ఇంట్లో ఉన్న గొడ్డలితో రాము, సరస్వతి, శ్రీనుపై దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన రాము అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు.

మంత్రి అచ్చంనాయుడిని కలిసిన ఉపకులపతి



తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చంనాయుడిని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి డాక్టర్ టి.జానకిరామ్ ఆదివారం మంత్రి కేంప్ ఆఫీసులో మర్యాద పూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయం తరఫున పుష్ప ప్రసాదం, ఉద్యాన ఉత్పత్తుల కిట్‌ను అందించి విశ్వవిద్యాలయ స్థితిగతులను వివరించారు. ఆయన వెంట రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డీవీ స్వామి ఉన్నారు.

ఇతర దేశాల్లో కచేరిలు చేయడం అభినందనీయం



పిప్పళ్ళ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, జూన్ 16 : సంగీతంలో డిప్లొమో పొంది ఆధ్యాత్మిక సంగీతంతో దేశ విదేశాల్లో కచేరిలు చేసి ఆ దేశాల్లో అవార్డులు సన్మానాలు పొందిన ప్రసాద్ అభినందనీయులని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భూటాన్ దేశంలో పలు రాష్ట్రాల్లో వారి ఆహ్వానంపై వెళ్లి ఆ దేశాల్లో కచేరీలు చేసి అవార్డులు పొందిన భీమవరం సంగీత కళాకారులు పిప్పళ్ల ప్రసాద్‌ను ఎమ్మెల్యే అంజిబాబు కార్యాలయంలో ఆదివారం అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తన ఇంట్లోనూ విశాఖపట్నంలోనూ తమ వియ్యంకులు నివాసంలో కూడా ప్రసాద్ సంగీత కచేరి చేశారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భూటాన్ దేశంలోని ఎకత్వా సచ్చిత్ సంస్థ కళాకారులను ఆహ్వానిస్తూ కచేరీలు ఇప్పించి అవార్డులతో సత్కరించడం వంటివి కొన్నేళ్లుగా చేస్తున్నారన్నారు. అనంతరం ప్రసాద్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, చెల్లబోయిన గోవింద్, విజ్జురోతి రాఘవులు, మైలబత్తుల ఐజాక్ బాబు, కొంద్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుతో ప్రజల్లో ఆనందం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 16: చంద్రబాబు నాయుడు సీఎంగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే హామీల మేరకు ఐదు ఫైళ్లపై సంతకాలు చేయడంతో ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గెలుపు ఉత్సాహంతో ప్రతీకార చర్యలకు పాల్పడవద్దని సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్‌లో సూచించారని, కూటమి శ్రేణులంతా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం చంద్రబాబు పోలవరం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, షేక్ బాజి, రాంలక్ష్మణ్, నల్లమిల్లి చినగోపిరెడ్డి, సురగాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా పోలీస్ తనిఖీలు



బస్సును తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, జూన్ 16 : జిల్లాలో రోడ్డు ప్రమదాల నివారణ, నేరనియంత్రణ చర్యల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ డీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాలోని రాష్ట్ర, జాతీయ, ఇతర రహదారులపై శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకూ పకడ్బందీగా గస్తీ నిర్వహించి వాహనాల తనిఖీ చేపట్టారు. రోడ్డు ప్రమదాల నివారణ కోసం డ్రైవర్లక ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో సారా, మద్యం అక్రమ రవాణా జరుగకుండా అరికట్టేందుకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సరిహద్దు ప్రాంతాల్లో కూడా ఈ తనిఖీలు నిర్వహించారు. ఎటిఎం, దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద అప్రమత్తంగా గస్తీని పోలీసులు నిర్వహించి అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. రాత్రివేళ లాడ్జీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో అనుమానాస్పదంగా ఉన్నవారిని గుర్తించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఈ చర్యలను చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు.

ప్లాస్టిక్ వాడకం బాధాకరం

భీమవరం టౌన్,జూన్ 16 : విద్యావంతులు కూడా ప్లాస్టిక్ వస్తువులనే వాడడం బాధాకరమని రైతు బజార్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, పర్యావరణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు బజార్‌లో రైతులు వినియోగదారులతో ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన ర్యాలీ, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ మాట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధించడానికి ప్రభుత్వం కొన్ని చట్టాలను చేసిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ప్లాస్టిక్ నిషేధ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రైతులు నాగన్న, బొల్ల రాముడు, శ్రీరామూర్తి, మోటుపల్లి సత్యనారా యణ, వేలూరి విద్య సాగర్, ఎస్కే చాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

మాది ప్రజా ప్రభుత్వం: పితాని



ఆచంటలో విద్యార్థులకు స్కూల్ కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే పితాని

ఆచంట, జూన్ 16: దుర్మార్గమైన ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పారని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాల యం వద్ద విద్యార్థులకు స్కూల్ కిట్‌లు పంపిణీ కార్యక్రమం ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ మాది ప్రజా ప్రభుత్వ మని, గత ప్రభుత్వంలో ఆత్మస్థైర్యాన్ని ప్రజా ప్రతినిధులు కోల్పోయారన్నా రు. ఇప్పటి నుంచి ఏ గ్రామాలో ఏ కార్యక్రమం జరిగినా పార్టీలకు అతీతం గా అందరు ప్రజా ప్రతినిధులను అధికారులు గౌరవించాలన్నారు. ప్రజా ప్రతినిధి లేని చోట సైతం తమ పార్టీ కార్యకర్తలను కూడా గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఎంపీపీ సూర్య కుమారి, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపీపీలు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపీడీవో పి. నరసింహ ప్రసాద్, తహసీల్దార్ ఐపీశెట్టి పాల్గొన్నారు.

గత ప్రభుత్వంలో ఎన్నో అవమానాలు: ఎంపీపీ

గత ప్రభుత్వంలో మాకెన్నో అవమానాలు జరిగాయి. అవన్ని తట్టుకుని ముందుకెళ్ళడం జరిగిందని ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి అన్నారు. ఆదివారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి ఎమ్మెల్యే ఎన్నో ఆటంకాలు సృష్టించారని అయినా పితాని సహకారంతో ధైర్యంతో తామంతా ముందుకు వెళ్ళి మండలాన్ని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ తమది ప్రజలను ఇబ్బంది పెట్టే ప్రభుత్వం కాదని అధికారులు నిబద్ధతతో పని చేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మండలంలో గత ప్రభుత్వంలో పలు భవనాలకు సంబంధించి నిర్మాణాలు వద్ద ఉన్న సామగ్రిని కొంత మంది తరలించుకుపోతున్నారని ప్రభుత్వ సొమ్ములతో నిర్మిస్తున్న భవనాలకు సంబంధించి సామగ్రిని ఎందుకు తీసుకుపోతున్నారని సంబంధిత అధికారిని అడిగారు. గత ఎమ్మెల్యే ఎక్కడా కూడా ఏ అభివృద్ధికి తన సొంత డబ్బులు ఖర్చు పెట్టలేదని కావాలనే అటువంటి ప్రచారం చేశారని పితాని విమర్శించారు.

ఎమ్మెల్యే పితానికి ఘన స్వాగతం

ఎమ్మెల్యేగా విజయం సాధించి తొలిసారి ఆచంట వచ్చిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను ఆదివారం కూటమి శ్రేణులు తీన్‌మార్ డప్పులు, బాణ సంచా కాల్పులతో స్వాగతం పలికి అభినందించారు. ముందుగా ఆచంటలో పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి అక్కడి నుంచి ర్యాలీగా ఎన్‌టీఆర్ విగ్రహం వద్దకు వచ్చి పూల మాలలు వేశారు.

దుమ్మాకొట్టిన వైసీపీ సర్పంచ్‌లు

ఆచంట, జూన్ 16: ఆచంటలో ఆదివారం జరిగిన మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి మండలానికి చెందిన కొంత మంది వైసీపీ సర్పంచ్‌లు దుమ్మా కొట్టారు. ఆచంట, కొడమంచిలి, ఎ. వేమవరం, శేషమ్మ చెరువు, పెదమల్లం సర్పంచ్‌లు దుమ్మా కొట్టగా కందరవల్లి, అయోధ్యలంక వైసీపీ సర్పంచ్‌లు హాజరయ్యారు. కొంత మంది వైసీపీ సభ్యులు, ఎంపీటీసీలు కూడా సమావేశానికి హాజరయ్యారు.

లోక కల్యాణార్థం సూర్యహోమం

పాలకొల్లు అర్బన్, జూన్ 16 : లోక కల్యాణార్థం, కరోనా అంతం కావాలని స్థానిక కోడిగట్టున ఉన్న శ్రీసరస్వతి శిశు మందిరంలో ఆదివారం 212వ వారం సూర్యహోమం నిర్వహించారు. కరోనా ప్రారంభం అయినప్పటి నుంచి ప్రతీ ఆదివారం నిర్వహించే ఈ సూర్యహోమం 212వ సూర్యహోమం అని నిర్వాహకులు తెలిపారు. వేదపండితులు సూర్య నమస్కారాలు, శాంతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కెవిఎస్ఎన్ నరసింహరాజు, భాస్కరరావు, కిరణ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పెనుగొండ, జూన్ 16: పెనుగొండ మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఎస్‌వీకేపీ డాక్టర్ కెఎస్ రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం పెనుగొండలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పెనుగొండ, పరిసర ప్రాంతలకు చెందిన షుగర్, బీపీ, కీళ్ళనొప్పులు, గుండె సమస్యలు, దంత వైద్య శిబిరానికి మొత్తం 69 మంది హాజరైనట్లు మానవత పెనుగొండ మండల అధ్యక్షుడు నేమాని శ్రీనివాస్ తెలిపారు.

రుద్రహోమం

పెనుగొండ, జూన్ 16: సిద్ధాంతం గరగాలమ్మ దిబ్బలో శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చండీ సమేత రుద్రహోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం గ్రామం సుఖ సంతోషాలు, పాడి పంటలతో మెలగాలని చండీ సమేత రుద్రహోమం నిర్వహించారు. ఉదయం శివుడికి ఏకాదశ రుద్రాభిషేకం, చండి పారాయణం, చండీ హోమం చతుర్విధ పారాయణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

డీఆర్ గోయెంకా విద్యార్థుల ప్రతిభ

పెంటపాడు, జూన్ 16: ప్రభుత్వ కళాశాలల సేవలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెంటపాడు ప్రభుత్వ డీఆర్ గోయెంకా జూనియర్ ఇంటర్ కళాశాల ప్రిన్సిపాల్ కే.చంద్రశేఖర్ బాబు కోరారు. కళాశాలలో 2024కు సంబంధించి ఎంపీసీ విద్యార్థి పి.తేజ 1000 మార్కులకు 945 సాధించడంతో అతనికి విట్ (వీఐటీ) అమరావతి హాస్టల్ వసతితో కూడిన ఇంజనీరింగ్ సీట్ ఉచితంగా ఇచ్చిందని, అలాగే హెచ్‌ఈసీ విద్యార్థి రోహిత్ ఏపీఆర్‌డీసీ ఎంట్రన్స్‌లో 70వ ర్యాంకు సాధించి ఏపీఆర్‌డీసీ నాగార్జున సాగర్‌లో సీటు సాధించాడన్నారు. 2019లో ఇదే కళాశాలలో చదివిన ఎం.వీరవర్ధన్ అనే విద్యార్థి విట్ ఏపీ లో సీటు సాధించి ప్రస్తుతం బెంగళూరులోని ఒక కంపెనీలో ఏడాదికి రూ. 14 లక్షల ప్యాకేజీతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

పద్మశాలీ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బెనర్జీ బాబు



పుట్టపర్తిలో జ్ఞాపిక అందుకుంటున్న బెనర్జీబాబు

తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: పద్మశాలీ సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాడేపల్లిగూడెంకు చెందిన బండారు బెనర్జీ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఎన్నిక నిర్వహించారు. సంఘ బలోపేతానికి శక్తి వంచన లేకుండా పనిచేస్తానని బెనర్జీ బాబు పేర్కొన్నారు.



కాస్మో కల్చర్ స్పోర్ట్స్ కార్యవర్గం

పాలకొల్లు రూరల్, జూన్ 16 : స్థానిక కాస్మో కల్చర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సంస్థ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. సంస్థకు గౌరవాధ్యక్షుడిగా సీహెచ్ శ్రీనివాసరాజు, అధ్యక్షుడిగా గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, ఉపాధ్యక్షుడిగా రుద్రరాజు సత్యనారాయణరాజు, కార్యదర్శిగా వీవీ సోమరాజు, జాయింట్ సెక్రటరీగా దండు గోపాల కృష్ణంరాజు, కోశాధికారిగా ఆర్.రమేష్ బాబుతో పాటుగా మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు అధ్యక్షుడు గాంధీ భగవాన్ రాజు తెలిపారు. నూతన కార్యవర్గసభ్యులను నీటి పారుదల శాఖామంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ అధ్యక్షుడు జీవీ, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కర్నేన గౌరునాయుడు, మాజీ కౌన్సిలర్లు వట్టం గణేష్, మల్లంపల్లి ఫకీర్ బాబు, పీతల శ్రీనివాస్, తదితరులు అభినందనలు తెలిపారు.

మొగల్తూరు ప్రధాన కాల్వ కలుషితం

కళేబరాలతో దుర్వాసన.. పేరుకుపోయిన చెత్త
ఈ కాల్వ నీరే పలు గ్రామాలకు తాగునీరు



కాల్వలో పేరుకుపోయిన చెత్త

మొగల్తూరు, జూన్ 16: మొగల్తూరు ప్రధాన కాల్వ కలుషిత కోరల్లో చిక్కుకుపోయింది. నిడద వోలు నుంచి వచ్చే ఈ ప్రధాన కాల్వ మొగల్తూరు శివారు ప్రాంతం ఇక్కడ మిగులు నీరు లాకు నుంచి ఉప్పుటేరులో కలుస్తోంది. నిత్యం ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే గుర్రపు డెక్క, చెత్తా చెదా రాలు, మానవ, జంతు కళేబరాలు శివారున ఉన్న మొగల్తూరుకు వచ్చి నిల్వ ఉండిపోతున్నాయి. ప్రధాన కాల్వలో నీటి ఎద్దడి కారణంగా లాకు తలుపులు తెరవడం లేదు. ఫలితంగా కాల్వలో ఉన్న చెత్తా చెదారాలు, జంతు మానవ కళేబరాలు నిల్వ ఉండి దుర్వాసన రావడంతో స్థానికులు, ప్ర యాణికులు కాలువ గట్టున నివాసం ఉండే నివాసి తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సమస్యను నూతన ప్రభుత్వం పరిష్కరించాలని ప్రజలు కోరు తున్నారు.

కంపు కొడుతున్న కాల్వలు

మొగల్తూరు ప్రధాన కాల్వను ఆనుకుని తీర గ్రామాల్లో సాగు, తాగునీటి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. అయితే గత ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభు త్వంలో ఈ కాల్వ ప్రక్షాళనకు నోచుకోలేదు. కాల్వ ఆధునికీకరణ పనులు చేసిన సమయంలోనూ శివారు ప్రాంతాలపై పాలకులు దృష్టి సారించకపోవడంతో చుక్క నీరు రావాలంటే గగనంగా మారు తోంది.

మంచినీటి చెరువులకు ఇదే కాల్వ నీరు

తీరంలోని మొగల్తూరు, కెపిపాలెం, తూర్పుతా ళ్ళలోని మంచినీటి ప్రాజెక్టు చెరువులకు ఇదే నీటి ని లిఫ్ట్ చేస్తున్నారు. అయితే తూడు, కళేబరాలతో కలుషితమైన నీటిని మంచినీటి చెరువులకు లిఫ్ట్ చేయడం వల్ల ఆ నీటిని తాగుతున్న ప్రజలు అనా రోగ్యాఆల బారిన పడుతున్నారని తీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తీరంలో నీలి విప్లవంతో వచ్చిన రొయ్య చేపల చెరువుల కార ణంగా భూగర్భజలాలు కలుషితంగా మారాయి. తీ రంలోని చాలా గ్రామాల్లో తాగునీటి కోసం బావులు తవ్వినా ఉప్పునీరు రావడంతో కుళాయి నీటిపైనే ప్రజలు ఆధారపడ్డారు. కాల్వను పరిశీలించిన వారంతా ఇలాంటి నీటిని తాగుతున్నామా అంటూ నివ్వెరపోతున్నారు.

ఎగువ ప్రాంతాల్లో పర్యవేక్షణ లేకపోవడం

మొగల్తూరు ప్రధాన కాల్వకు ఎగువ ప్రాంతాల్లో పర్యవేక్షణ లేకపోవడం వల్లే శివారుకు చెత్తా చెదా రాలు కళేబరాలు వస్తున్నాయి. ఎగువ ప్రాంతంలో నీటి పారుదల శాఖాధికారులు కనీసం ఆయా లాకుల వద్ద పర్యవేక్షణ చేసి ప్రత్యేక సిబ్బందితో చెత్త రాకుండా అక్కడే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని శివారు ప్రాంత ప్రజలు, రైతులు కోరుతున్నారు.

కాల్వలు ప్రక్షాళన చేయాలి
దూది మూర్తిరాజు, మొగల్తూరు



మొగల్తూరు ప్రధాన కాల్వను ప్రక్షాళన చేయాలి. గడచిన ఐదు సంవత్సరాల్లో కాల్వను శుభ్రం చేయకపోవడంతో ఆనీటి వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతు న్నాయి. నూతన ప్రభుత్వం కాల్వను ప్రక్షాళన చేయాలని కోరుతున్నాం.

మంత్రి నిమ్మలపై ఆశలు
ఎం. సత్యనారాయణ, మాజీ సర్పంచ్



రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రిగా పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు బాధ్య తలు చేపట్టడంతో మొగల్తూరు ప్రధాన కాల్వ ప్రక్షాళన జరుగు తుందని మంత్రిపై ఆశలు పెట్టుకున్నాం. శివారు ప్రాంత, తాగు, సాగునీటి అవసరాలకు ఉపయోగ పడే మొగల్తూరు ప్రధాన కాల్వ ప్రక్షాళన చేస్తా రని ఆశిస్తున్నాం.

ట్రాన్స్‌ఫార్మర్‌కు భూమి పూజ



భూమిపూజలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ఆకివీడు, జూన్ 16: పట్టణంలోని ఆరోవ వార్డులో లో-వోల్టేజీకి సంబంధించిన సమస్యలు పరిష్కారానికి ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు టీడీపీ-జనసేన పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, పిల్లా బాబు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు గుర్రాని నాగలక్ష్మి, కిమిడి నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాధాకృష్ణను కలసిన మంత్రి సుభాష్



తణుకు, జూన్ 16: రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ఆయన నివాసంలో కలిశారు. మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత మొదటి విచ్చేసిన సుభాష్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి సత్కరించారు. అనంతరం సజ్జాపురంలోని రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ మాజీ చైర్మన్ డా. దొమ్మేటి వెంకట సుధాకర్‌ను ఆయన నివాసంలో కలిశారు. సుభాష్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పితృ దినోత్సవం



తాడేపల్లిగూడెంలో తండ్రికి సత్కారం

తణుకు, జూన్ 16: సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో కేర్ ఆసుపత్రిలో ఆదివారం పితృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సాహితీ సామ్రాజ్యం అధ్యక్షుడు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ జీవిత పాఠాలు నేర్పే నాన్న గొప్పతనం, త్యాగాలను స్మరించుకోవడానికే పితృ దినోత్సవం అన్నారు. డాక్టర్ కోనా భార్గవ్‌ను సత్కరించారు. నాన్నా నేనున్నా అనే అంశంపై సమావేశం నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది మధుబాబు, రాజు, శిరీష, వైష్ణవి, తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలోని శ్రీ విశ్వవిజ్ఞాన ఆధ్యాత్మిక పీఠంలో ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా పీఠం ఆధ్వర్యంలో పిల్లలు తండ్రులను సత్కరించే కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు కరిబండి రామకృష్ణ, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆంజనేయరాజు, సుజాత, సుభద్ర, గుప్తా, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండి: ఫాదర్స్‌డే పురస్కరించుకుని ఎస్‌ఆర్‌పిఅగ్రహారంలోని ట్రినిటి లూథరన్ దేవాలయంలో ఆదివారం ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ యం.జోసెఫ్, ప్యారిస్ పాస్టర్ డి. సతీష్‌కుమార్ మాట్లాడుతూ దేవుని మాట ప్రకారం పిల్లలు తల్లిదండ్రులకు విధేయులుగా నడుచుకోవాలన్నారు.

22న గజల్స్ శ్రీనివాస్‌కు పురస్కారం

తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: తాడేపల్లిగూడెం తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ నెల 22న గజల్స్ శ్రీనివాస్‌కు గజల్ సామ్రాట్ అవార్డు ప్రదానం చేయనున్నట్టు సమాఖ్య అధ్యక్షుడు మండ బ్రహ్మాజీ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొంటారని, ఈ సందర్భంగా గజల్స్ శ్రీనివాస్ గానలహరి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

యోగాతో ఆరోగ్యం



ర్యాలీ ప్రారంభిస్తున్న సీఐ

తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: యోగాతో మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక రుగ్మతలు దూరమవుతాయని పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. జూన్ 21న నిర్వహించే యోగా దినోత్సవంపై అవగాహన కల్పించేందుకు ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీని సీఐ ప్రారంభించారు. కరిబండి రామకృష్ణ, యోగా గురువులు మాధవరావు, చంద్రశేఖర్, అంబిక తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ భేష్



క్రీడాకారులతో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం రూరల్, జూన 16: యువతలో స్ఫూర్తి నింపేలా క్రీడా పోటీల నిర్వహణ అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. వానపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం విమానాశ్రయ భూముల్లో ఫ్రెండ్లీ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ యువతకు తాడేపల్లిగూడెంలో సరైన క్రీడా ప్రాంగణంలేదని టీడీపీ హయాంలో గతంలో నిర్మాణం చేపట్టిన ఇండోర్ స్టేడియం పూర్తిచేసి యువతకు బహుమతిగా ఇస్తామన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు, జనసేన నాయకులు వర్తనపల్లి కాశీ, ఫైబోయిన రఘు, నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

భీమవరం టౌన్, జూన్ 16 : కష్టపడి పిల్లలను తల్లిదండ్రులు చదివించిన తర్వాత ఉన్నత ప్రయోజకులైతే ఆ కుటుంబ పరిస్థితి మారిపోతుందని ఎమ్మెల్యే రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం కిరాణా మర్చంట్ భవనంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు సుమారు 500 మందికి బుక్స్‌పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమాన్విత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, జనసేన ప్రచార కమిటి కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ, జనసేన నాయకులు పరుచూరి నాగేశ్వరరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు పూసరపు గుప్త, కార్యదర్శి రాచపూడి శ్రీనివాస్,నందిపాటి రామకృష్ణ పాల్గొన్నారు

గొల్లలకోడేరులో పంట బోదెలకు మోక్షం



పాలకోడురు, జూన్ 16: గొల్లలకోడేరు గ్రామంలో ఇప్పటి వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. గ్రామంలోని బ్రాహ్మణచెరువు, దళితపేటకు వెళ్ళే మంచినీటి చెరువుకు ఆనుకుని ఉన్న పంట బోది కొన్ని సంవత్సరాలుగా పూడుకుపోయి మురుగుబోదెలా తయారైంది. దీంతో బ్రాహ్మణ చెరువు, దళితపేటలోని మంచినీటి చెరువుగా ఉన్న చెరువులు కాస్త మురికి కూపంలా తయారయ్యాయి. చెరువులను అభివృద్ధి చేయాలంటూ ఇటీవల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనాలకు గ్రామ టీడీపీ అధ్యక్షుడు కమ్మిలి రాంబాబు స్పందించారు. పంచాయతీ పట్టించుకోకపోవడం గ్రామంలోని మంచినీటి చెరువులు పాడైపోవడంతో ఆయన నడుం బిగించారు. సొమ్ములు వచ్చినా రాకపోయిన గ్రామాన్ని అభివృద్ధి చేస్తానంటూ ఆదివారం ఎక్సకవేటర్లను ఏర్పాటు చేసి పూడుకుపోయిన పంట బోదెకి మోక్షం కల్పించారు. ఈ పంటబోదె పూర్తిస్థాయిలో బాగుపడితే రెండు చెరువులు బాగుపడతాయని గ్రామస్థులు అంటున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహరాజు, వెంకటేశ్వరరావు, సాలా మల్లేశ్వరరావు, కొండపల్లి ఏసురత్నం, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వాసవి జాగృతి కార్యవర్గం ప్రమాణ స్వీకారం



భీమవరం అర్బన్, జూన్ 16: వాసవి జాగృతి విజేఎఫ్ నూతన క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం భీమవరం ప్యాడీ రైస్ మర్చంట్ భవనంలో ఆదివారం నిర్వహించారు. క్లబ్ ఫౌండర్ ప్రెసిడెంట్ తిరివిధి వేణుగోపాల్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవి జాగృతి వీజేఎఫ్ భీమవరం క్లబ్ అధ్యక్షునిగా పత్రిపాటి బీటీఎస్ఎన్ గుప్త (పత్రిపాటి శ్రీను), కార్యదర్శిగా సబ్బిశెట్టి శ్రీనివాస్ గణేష్, కోశాధికారిగా సంకా అనంత గోపాలం నియమితులయ్యారు.



ముగిసిన వేసవి ఉచిత కరాటే శిక్షణ

భీమవరం అర్బన్, జూన్ 16: డా.బీవీరాజు వీరమ్మ పార్కు ఆవరణలో చిన్నారులకు వేసవి సందర్భంగా కియో జపాన్ షోటోకాన్ కరాటే ఇన్‌స్టిట్యూట్ నిర్వహించిన ఉచిత కరాటే శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా ఏపీపీసీసీ సభ్యులు, సీనియర్ బాడీ బిల్డర్ అద్దంకి దొరబాబు, సంఘసేవకులు అల్లు శ్రీనివాస్, కరణం రాము, వెంకట్ మాస్టర్, పుచ్చకాయల రత్నరాజు, కొర్ర శ్రీనివాస్, సుంకర నరేష్ పాల్గొన్నారు.

మే-జూన్ పుష్పం కనువిందు



ఉండి, జూన్ 16: మే-జూన్ పుష్పం కనువిందు చేసింది. చెరుకువాడకు చెందిన గాదిరాజు రంగరాజు మాస్టారు ఇంటి పెరట్లో ఈపువ్వు పూచింది. రక్తకలువగా పిలువబడే ఈపువ్వును బాణం, చేపలు పట్టే గాలం ముల్లుకు ఆహారంగా వాడేవారు. ప్రధానంగా ఔషధాలు తయారీకి దీనిని ఉపయోగిస్తారు.



కేఎస్ గట్టులో సమావేశమైన టీడీపీ నాయకులు

టీడీపీ విజయోత్సవాలు

అత్తిలి, జూన్ 16 : తణుకు ఎమ్మెల్యేగా ఆరిమిల్లి రాధాకృష్ణ భారీ మెజార్టీతో గెలవడంతో కేఎస్ గట్టు గ్రామంలో విజయోత్సవాలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు తణుకు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఘన విజయం సాధించడంతో ఆదివారం కేక్ కట్ చేశారు. టీడీపీ శ్రేణులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచాయి. టీడీపీ నాయకులు మెంతి రాజ్‌కుమార్, గుడాల కాంతారావు, సత్తిబాబు, గుండేపల్లి మురళీ, చిట్టాల పార్వతి, కడలి సుశీల, గుడాల సత్యనారాయణ, కడలి శ్రీను, కేతం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు నరసింహులు మృతి

పెనుమంట్ర, జూన్ 16 : బ్రాహ్మణ చెరువు గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, సివిల్ సప్లయిస్ మాజీ మేస్త్రి మల్లుల వెంకట నరసింహులు ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతికి సీపీఎం, సీఐటీయూ తదితర నాయకులు సంతాపాన్ని తెలియజేశారు.

వైభవంగా లక్ష్మీగణపతి కల్యాణోత్సవాలు



పాలకొల్లు అర్బన్, జూన్16 : ఏఏఎస్ కాలనీలోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం 19వ వార్షికోత్సవం ఈనెల 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం శ్రీసిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివార్లకు పాంచాహ్నిక కల్యాణం నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పంచామృతాభిషేకం, వంటి కార్యక్రమాలు బ్రహ్మశ్రీ సన్నిది రాజు శివ దుర్గ శర్మ, కొత్తలంక సుభాష్ శర్మల యాజ్ఞీకంలో నిర్వహించారు.

వైభవంగా వరాల వెంకన్న కల్యాణం



అత్తిలి, జూన్ 16: ఈడూరులో వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. అనంతరం స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం షైపాల సతీష్ దంపతులు పూజలు నిర్వహించారు. కర్రి నాగేశ్వరరావు బృందం హనుమాన్ చాలీసా పారాయణం చేసింది. అనంతరం కల్యాణం జరిగింది. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాత్తూరికి చంద్రబాబు అభినందనలు



నరసాపురం, టౌన్, జూన్ 16: మీ పనితీరు చాలా బాగుంది, నా మాటకు కట్టుబడి జనసేన అభ్యర్థి గెలుపుకు రేయింబవళ్లు పని చేశారు, జనసేన అధినేత కూడా మీరు ఎంత కష్టపడ్డారో చెప్పారు, నాకు చాలా సంతోషంగా ఉంది, మీ నియోజకవర్గానికి ఏం చేస్తానని చెప్పానో... అవి చేసి చూపిస్తా, అంతా కష్టపడి పని చేయండి అంటూ టీడీపీ నాయకుల్ని చంద్రబాబు అభినందించారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో ఆదివారం అమరావతిలో చంద్రబాబును కలిశారు. పార్టీ కోసం పొత్తూరి ఎంత కష్టపడ్డారో నాకు తెలుసు అంటూ చంద్రబాబు కితాబు ఇచ్చారు. త్వరలో మీ అందరితో మరోసారి సమావేశం అవుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి



విజేతలకు షీల్డ్‌లందిస్తున్న ఎమ్మెల్యే బొమ్మిడి, మాజీ ఎమ్మెల్యే బండారు

నరసాపురం టౌన్, జూన్ 16: క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమని, ఎవరు ఓడినా.... గెలిచినా... క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. ఆదివారం చినమామిడిపల్లి నాగారమ్మ అలయ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫైనల్ క్రికెట్ పోటీలను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడుతో కలిసి తిలకించి, విజేతలకు బహుమతులు, షీల్డ్‌లందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామీణ క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరావు, వలవల నాని, రెడ్డెం శ్రీను, గంటా కృష్ణ, సోమరాజు భరత్ పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

నరసాపురం రూరల్, జూన్ 16: వైఎస్‌పాలెం గ్రామంలో ఆదివారం గర్భిణులకు ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించారు. పాలకొల్లుకు చెందిన ఉమా ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ ఉమాదేవి 150 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. సాధారణ డెలివరీ, ఆపరేషన్లు, క్యాన్సర్, స్క్రీనింగ్, అండాశయంలోని గడ్డలు, నీటి బుడగలు తొలగించడం తదితర విషయాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వైఎస్ నాగముత్యాలాంబ, వైఎస్ బాబులు, విశ్వ, వెంకటేశ్వర్లు, వాసు, శ్రీదేవి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా కూటమి విజయం

తణుకు, జూన్ 16: చరిత్రలో నిలిచిపోయేలా రాష్ట్ర ప్రజలు కూటమికి పట్టం కట్టారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీలపై చంద్రబాబు 5 సంతకాలు చేయడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. మెగా డీఎస్సీకి సంతకం చేశారని, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై, పింఛను పెంపు హామీపై సంతకం చేసి సీఎం మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. అనంతరం సొసైటీ రోడ్డులోని అన్నక్యాంటీన్‌ను పరిశీలించారు. నాయకులు కలగర వెంకటకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, డా.దొమ్మేటి వెంకట సుధాకర్, బసవా రామకృష్ణ, పితాని మోహన్, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, ఆనాల ఆదినారాయణ, చిక్కాల వేణు, ఆకేటి కాశి, మారుతీరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

తణుకు, జూన్ 16: ప్రభుత్వం అందించే విద్యా కానుక కిట్లు ఉపయోగించుకుని విద్యార్థులు చదువుకుని ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు బాలుర ఉన్నత, బాలికోన్నత పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, యూనిఫాం క్లాత్, పాఠ్య, నోటు పుస్తకాల కిట్లు ఇంగ్లీషు, తెలుగు డిక్షనరీలు అందజేశారు. హెచ్ఎం పద్మావతి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



గణపవరంలో బక్రీదుకు ముస్తాబైన మసీదు

గణపవరం, జూన్ 16: త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పండుగను సోమవారం నిర్వహించేందుకు ముస్లింలు సన్నాహాలు చేసుకుంటున్నారు. గణపవరం మసీదులో ప్రత్యేక ప్రార్థనల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకున్నారు. మసీదులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పొట్టేలు కొనుగోలు చేసేందుకు ముస్లింలు పోటీపడ్డారు.

హనుమాన్ చాలీసా పారాయణ

గణపవరం, జూన్ 16: సువర్చల సమేత ఆంజనేయస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వంకాయల రామారావు దంపతుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు హనుమాన్ చాలిసా పారాయణ నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వంకాయల పంచముఖి వీరాంజనేయులు, వంకాయల వెంకటేశ్వరరావు, నడిపల్లి శ్రీరామ్, రేవతి పాల్గొన్నారు.